క్లుప్తంగా

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాస్

జగిత్యాల: పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఖిలాలో పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పారిశుధ్య పనులను పకడ్బందిగా చేపట్టాలని ఆదేశించారు. ఖిలాలో పలు పూలమొక్కలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ అనిల్‌బాబు, డీఈ రాజేశ్వర్, కౌన్సిలర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రాము పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్

మెట్‌పల్లి: పట్టణంలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తానని చైర్ పర్సన్ రాణవేని సుజాత అన్నారు. స్థానిక 23 వార్డులో రూ.4 లక్షలతో నిర్మించే సీసీ రహదారి పనులకు సోమవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల మున్సిపాలిటీకి రూ.10 కోట్లను మంజూరు చేసిందని, ఆ నిధుల్లో నుంచి ఎక్కువ భాగం రహదారుల అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఒజ్జెల బుచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దేశభక్తి పెంపొందించుకోవాలి



జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న చైర్మన్

రాయికల్: ప్రతి ఒక్కరు దేశభక్తి పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. సోమవారం స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల్లో భాగంగా ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు మ్యాకల కాంతారావు, మహేందర్, మహేశ్ గౌడ్, అచ్యుత్‌రావు, హుస్సేన్, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల పరిశీలన



ఆయిల్‌పామ్ తోటలో ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: విజ్ఞాన విహారయాత్రలో భాగంగా ఎంపీపీ జాజాల భీమేశ్వరితో పాటు ఎంపీటీసీలు సోమవారం ఏలూరు జిల్లా సూర్యచంద్రరావుపేటలో 30 ఎకరాల్లో వేసిన ఆయిల్‌పామ్ తోటలు పరిశీలించారు. రైతు మధుసుధన్‌రావుకు ఎకరానికి ఎన్ని మొక్కలు నాటారు 3 ఏళ్ల తర్వాత పంట దిగుబడి ఏలా వస్తుంది.. ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు ఎలా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విజయవాడలోని కనకదుర్గా ఆలయంలో కోరుట్ల ఎమ్మెల్యేగా కల్వకుంట్ల సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధించాలని అమ్మవారికి ముడుపు కట్టి ప్రత్యేక పూజలు చేసినట్లు ఎంపీపీ జాజాల తెలిపారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంత్రికి బీఆర్‌ఎస్ నాయకుల కృతజ్ఞతలు

వెల్గటూర్: మండలంలోని వెంకటాపూర్ బస్‌స్టాప్ నుంచి స్కూల్ వరకు రూ.1.40 కోట్లతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఎన్నో ఏళ్ల కల నెరవేర్చినందుకు వెంకటాపూర్ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు కంది తిరుపతి, అల్లం లనిల్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

ఫసల్ పోయినా పని కల్పించలేదు..

- నిరుపయోగంగా మహిళా సంఘాల ట్రాక్టర్
- వడ్డీ భారం, నష్టం భరించేదెవ్వరో?



మహిళా సంఘాలకు అందజేసిన ట్రాక్టర్

సారంగాపూర్: రూపాయి కాదు రెండు రూపాయలు కాదు ఏకంగా రూ. 8 లక్షల విలువ చేసే ట్రాక్టరును ఐదు నెలలుగా నిరుపయోగంగా ఉంచారు. అధికారులు దీనిపై పడే వడ్డీ భారం ఎవరి భరిస్తారన్న విషయాన్ని ఆలోచించడం లేదు. మహిళా సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి సారంగాపూర్ సెర్ప్ పరిధిలో జాగృతి మండల సమాఖ్య... సారంగాపూర్ మహిళా సంఘాలచే కస్టమ్ హైరింగ్ కేంద్రాన్ని సెంటర్ (వ్యవసాయ యంత్ర పరికరాల అద్దె కేంద్రం) గడచిన మార్చి–ఏప్రిల్ నెలలో ప్రారంభించారు. కేంద్రాన్ని ప్రారంభించి దాదాపు ఆరునెలలు కావస్తున్నా హైరింగ్ కేంద్రానికి కేటాయించిన ట్రాక్టర్, ఇతర ట్రాక్టర్ పనిముట్లకు ఇప్పటికీ పని కల్పించలేదు. వ్యవసాయ యంత్రాలను సంఘాల్లోని సభ్యులకు అందజేసి, వాటిని మహిళా సంఘాల సభ్యుల ద్వారా నిర్వహించి, ట్రాక్టర్‌పై ఉన్న అప్పును వడ్డీతో కలిపి చెల్లించాలి. ప్రస్తుతం వానాకాలం నాట్లు 90 శాతం వరకు మండలంలో పూర్తయ్యాయి. ఇప్పటి వరకు ట్రాక్టర్‌కు రూపాయి పనిమాత్రం అధికారులు కల్పించలేదు. ట్రాక్టర్, పనిముట్లు నిరుపయోగంగా ఉండడంతో దీనిపై వచ్చే నష్టం ఎవరు భరిస్తారో అధికారులే చెప్పాలని సంఘాల మహిళలు కోరుతున్నారు.

పారదర్శకంగా గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక





జగిత్యాల మండలం హన్మాజీపేట, ఇబ్రహీంపట్నంలో విచారణ చేస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో గృహలక్ష్మి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతుందని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రాజేశ్వరి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో గృహలక్ష్మి దరఖాస్తుదారుల ఇంటింటికీ తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను పరిశీలన అనంతరం ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపిక పారదర్శకంగా ఉంటుందన్నారు. సర్పంచ్ బొడ్డు దామోదర్, ఎంపీటీసీ ఆరె సౌజన్య పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి

పెగడపల్లి: గృహలక్ష్మి పథకంలో అర్హులను గుర్తించాలని ఎంపీపీ శోభ అధికారులకు సూచించారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారుల ఎంపికలో పాటించాల్సిన విధి విధానాలు, నియమ, నింబంధనలపై సోమవారం ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, దరఖాస్తుల సర్వే సిబ్బందికి అవగాహన కల్పించారు. అర్హుల ఎంపికలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఎంఎ ఫరూక్, ఎంపీవో మహేందర్, ఏఎంసీ చైర్మెన్ నిర్మల, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ అవకాశం

మల్లాపూర్: అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకంలో ఇళ్లు అందిస్తారని సహాయ గణాంకాధికారి(ఎఎస్‌వో) శ్రీనివాస్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని హుస్సేన్‌నగర్‌లో సర్పంచ్ సయ్యద్ హైదర్‌తో కలిసి గృహలక్ష్మి సర్వేలో పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ రవి, ఉపసర్పంచ్ షేక్ సాదుల్లా, పంచాయతీ కార్యదర్శి షదన్, వార్డుసభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

ఇబ్రహీంపట్నం: గృహలక్ష్మి పథకానికి మండలంలోని 17 గ్రామాల్లో 1202 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించేందుకు సోమవారం అధికారులు దరఖాస్తుదారుల ఇంటింటికీ వెళ్ళి పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనన్నట్లు ఎంపీడీవో ప్రభు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి విచారణ

మల్యాల: గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో నుండి అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. ఎంపీడీవో వేంకటేశం, ఆర్ఐ తిరుపతి, తహసీల్దార్ మునీందర్, ఎంపీవో వాసవి రెండు బృందాలుగా ఏర్పడి, ఇంటింటికీ తిరిగి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారి భూమి వివరాలు, గతంలో ఇల్లు ఉన్నదా..వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు.

సారంగాపూర్: గృహలక్ష్మి పథకంలో అర్హుల గుర్తింపునకు సోమవారం మండలంలో అధికారులు సర్వే చేపట్టారు. మొదటి రోజు మూడు సర్వే బృందాలు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులుగా గుర్తించడానికి గ్రామాల వారిగా సర్వే నిర్వహించారు. మండలంలో మొత్తం 1287 మంది గృహలక్ష్మి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

తహసీల్దార్లకు రెండో ఏఎన్‌ఎంల సమ్మె నోటీసు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు

కథలాపూర్: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు రెండో ఏఎన్‌ఎంలు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రేవతి, నాగేశ్వరి, శిరీషా, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం లను రెగ్యులర్ చేయాలి

మల్లాపూర్ : కాంట్రాక్ట్ ఏఎన్‌ఎం లను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని ఈసీ ఏఎన్‌ఎంలు కోమల, విజయలక్ష్మీ అన్నారు. సోమవారం తహసీల్దార్ వీర్ సింగ్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించామని, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 16 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: తమ డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌వోకు, గోదూర్ బస్తీ దవాఖాన వైద్యులు రాజేందర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సుప్రియ, అనిక, పద్మ, మాలతి, ఎస్తెరు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

వెల్గటూర్: మండల తహసీల్దార్‌గా ఆర్ శేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉయ్యాల రమేశ్ కరీంనగర్ అర్బన్ తహసీల్దార్‌గా బదిలీ కాగా, నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆర్ శేఖర్‌ను వెల్గటూర్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

యూత్ పట్టణ కమిటీ ఎన్నిక

రాయికల్: పట్టణంలోని కుమ్మరి శాలివాహన ప్రజాపతి యూత్ పట్టణ అధ్యక్షుడిగా కొత్తపల్లి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా గంగాధరి సురేశ్, ఉపాధ్యక్షుడిగా కొడిమ్యాల మహేశ్, కోశాధికారిగా దుంపేట రాజు, సంయుక్త కార్యదర్శిగా నరేశ్ సోమవారం ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పెగడపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాలు వెల్లడించారు. మండలంలోని వెంగళాయిపేటకు చెందిన తోట అనిల్, ఆరవెల్లి గ్రామానికి చెందిన దూస సంతోష్ కొద్దిరోజులుగా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి తీసుకువచ్చి వేర్వేరు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మద్దులపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రహదారిపై పోలీసులు వీరిని తనిఖీ చేయగా వారి వద్ద 300 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే తహసీల్దార్ ఎంఎ ఫరూక్ సమక్షంలో పంచనామా నిర్వహించామని, గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిని కోర్టులో హాజరుపర్చామని సీఐ పేర్కొన్నారు.

19న తపస్ మహాధర్నా

ధర్మపురి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 19న హైదరాబాద్‌లో చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ రొట్టె శ్రీనివాస్ కోరారు. పట్టణంలో సోమవారం మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు బండి మహేశ్, కాశెట్టి రమేశ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాశెట్టి శ్రీనివాస్, రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో శివాంజనేయ అడుగుల భజనలు



ఆలయం లోపల భజన చేస్తున్న భక్తులు

కొండగట్టు: ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం నాగారం గ్రామానికి చెందిన శివాంజనేయ అడుగుల భజన మండలి ఆధ్వర్యంలో భజన నృత్యాలు చేశారు. వీరు నృత్యం చేసే సమయంలో మరో 10 నిమిషాల్లో ఆలయం మూసి వేయాల్సి ఉండగా అక్కడకు హోంగార్డు చేరుకుని వారిని బయటకు పంపివేశారని భజన మండలి సభ్యులు సాక్షికి తెలిపారు చివరి భీజక్షరం ముగుస్తున్న సమయంలో ఇలా చేయవద్దని కనీసం 2 నిమిషాల సమయం అడిగిన ఇవ్వలేదని నిరాశ వ్యక్తం చేస్తూ తిరిగి ఆలయం ఎదుట నృత్యం పూర్తి చేశామన్నారు.

'వేములవాడ అభ్యర్థిని సీఎం నిర్ణయిస్తారు'

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనేది సీఎం కేసీఆర్ నిర్ణయిస్తారని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. సోమవారం సిరికొండలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, మైనార్టీలకు రూ.లక్ష సాయం చెక్కులు అందించారు. కొందరు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారని, సర్వేలు చేయించి అభ్యర్థులను సీఎం కేసీఆర్ ఎంపిక చేస్తారని తెలిపారు. వచ్చేనెలలో దళితబంధు, బీసీ కులవృత్తులకు సాయం ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రతీ 100 మందికి ఒక బూత్‌కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ ఇంటికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని, ప్రజలను ఓట్లు అడిగే హక్కు బీఆర్‌ఎస్‌కే ఉందని అన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, సింగిల్‌విండో చైర్మన్ చుక్క దేవరాజం, సర్పంచ్ ఎంజీ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

రాయికల్: మండలంలోని వస్తాపూర్, దావన్‌పల్లి, అయోధ్య గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో నిజామాబాద్‌లో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ప్రధాన కార్యదర్శి ఆకుల మహేశ్, గిరిజన మోర్చా అధ్యక్షుడు తిరుపతినాయక్, మండల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

మెట్‌పల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులు సోమవారం జెండాలు అందజేశారు.

తహసీల్దార్లకు సన్మానం

కథలాపూర్: మేడిపెల్లి తహసీల్దార్ వసంత, బీమారం తహసీల్దార్ రవికిరణ్‌లను సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలందించాలని వారిని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

రాయికల్: బీఆర్‌ఎస్ హయాంలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని 4,5 వార్డుల్లో 25 మంది గంగపుత్ర సంఘ సభ్యులు కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, కుర్మపల్లి సర్పంచ్ రాజు ఆధ్వర్యంలో సుమారు 30 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విమర్శించడం వారికి అలవాటుగా మారిందన్నారు. అనంతరం రాయికల్ పట్టణానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, ఏఎంసీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్ మ్యాకల కాంతారావు, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం

రాయికల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్, ఒడ్డెరకాలనీల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొబైల్ మెడికేర్ యూనిట్‌పేరిట ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో

జగిత్యాల: ఇటీవల నూతనంగా నియమితులైన ఆర్డీవో నర్సింహమూర్తి సోమవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నియోజకవర్గ సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన మహిళా సంఘం అధ్యక్షులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ అన్నపూర్ణ మహిళా సంఘం అధ్యక్షురాలుగా మారు సత్తవ్వ, అర్బన్ మండల అన్నపూర్ణ మహిళా సంఘం అధ్యక్షురాలుగా భవాని ఇటీవల ఎన్నిక కాగా, సోమవారం వారు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బాలముకుందం, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగాధర్, రవీందర్ పాల్గొన్నారు.

తండాలను కలిపి గ్రామపంచాయతీ చేయాలని వినతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం ఆసునూరిగూడెం, లంబాడి తండా, నాయికపుగూడెం మూడింటిని కలిపి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా తండా వాసులు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప తదితరులు ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

మల్యాల: పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణతో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. మల్యాల అడ్డరోడ్డులోని అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థుల వివిధ విభాగాల కెప్టెన్లు, వైస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై మాట్లాడారు. పాఠశాలలో సరస్, తేజస్, ధ్రువ, లక్ష్య విభాగాలకు ఎన్నికలు నిర్వహించి, కెప్టెన్, వైఎస్ కెప్టెన్ల ఎన్నికలు నిర్వహించామని, ప్రాథమిక స్థాయి దశ నుండే విద్యార్థులకు తమ బాధ్యతలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీలందరికీ దళితబంధు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గజ్జెల స్వామి

పెగడపల్లి: ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధు పథకం కింద ఆర్థిక సాయం అందించాలని ధర్మపురి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజ్జెల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితరహిత దళితబంధు దరఖాస్తు ఉద్యమం పేరిట సోమవారం పెగడపల్లిలో దళిత ప్రజలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ ఎంఎ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కిందట దళితబంధు అమలు చేసిన ప్రభుత్వం గ్రామాల్లో ఒకరిద్దరికీ దళితబంధు సాయం చేసి మిగతా వారిని విస్మరించిందన్నారు. ధర్మపురి నుంచి పదేళ్లుగా ప్రభుత్వంలో ఉండి ఐదేళ్లుగా మంత్రిగా ఉన్న ఈశ్వర్ దళితులకు చేసిన మేలు శూన్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అరికట్ల సంజీవ్, ఐతరవేని కొమురయ్య, రాజయ్య, వినోద్, పోచయ్య, నర్సయ్య, వెంకటేశ్, రాజేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎన్‌ఆర్‌ఐ పాలసీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి

మల్లాపూర్: గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎన్‌ఆర్‌ఐ పాలసీ ఏర్పాటు చేయాలని గల్ఫ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు పెనుకుల అశోక్ కోరారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు బోగ శ్రావణిని ఆయన కలిసి వినతిపత్రం అందించారు. ఉన్న ఊరిలో పనిలేక ఉపాధి కోసం ఏడారి దేశాలకు వలస వస్తున్నారని, వలస జీవుల వెతలు తీరాలంటే కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఐ పాలసీని ప్రకటించాలని సూచించారు. కేంద్ర దృష్టికి తీసుకెళ్తానని శ్రావణి తెలిపారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంఘం నాయకులు అన్నపు చందు, నరేశ్, ఆరెల్లి మహేశ్ పాల్గొన్నారు.

జెడ్పీచైర్‌పర్సన్‌ను కలిసిన మహిళలు

జగిత్యాలజోన్: జగిత్యాల మహిళా సంఘాల అధ్యక్షులు సోమవారం జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతను కలిశారు. ఇటీవల జగిత్యాల రూరల్ మండలం అన్నపూర్ణ మహిళ సంఘం అధ్యక్షురాలిగా నియమితులైన మారు సత్తవ్వ, అర్బన్ మండల అన్నపూర్ణ మహిళ సంఘం అధ్యక్షురాలుగా నియమితులైన భవానిలతో పాటు, మహిళ సంఘాల సభ్యులు జెడ్పీచైర్‌పర్సన్‌ను కలిశారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

కథలాపూర్: మండలంలోని సిరికొండలో ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ప్రజలకు పరీక్షలు చేసి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధుల పరిష్కారానికి ఆయుర్వేద మందులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు రజిత, వైద్యుడు ప్రతాప్, ఫార్మసిస్ట్ దోసారపు విజ య్‌కుమార్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

కోరుట్ల: పట్టణ శివారులోని అయోధ్యపట్నంలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు సోమవారం ఆర్డీవో రాజేశ్వర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. కాలనీలో మౌలిక వసతులతో పాటు సంఘ భవనం, శ్మశాన వాటిక ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పల్లపు రాజు, రాజు, వేముల రాము, జల్పతి పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మల్లాపూర్: మండల ప్రెస్‌క్లబ్ (టీయుడబ్ల్యూజెహెచ్–143) అధ్యక్షుడిగా ముత్యాల రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. ఉపాధ్యక్షుడిగా ఉడుగుల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా నూనె అంజనేయులు, కోశాధికారిగా పెంబి మహేష్, కార్యదర్శిగా మోర సతీష్, సంయుక్త కార్యదర్శిగా బజారు శ్రీధర్‌తో పాటు కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు ముత్యాల రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

16 నుంచి కుష్ఠు నిర్ధారణ క్యాంపెయిన్

వెల్గటూర్: ఈ నెల 16 నుంచి 31 వరకు లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.రమేశ్ తెలిపారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి స్పర్శ లేకపోవడం, తెలుపు లేక గోధుమ వర్ణం మచ్చలు ఉన్న వారిని గుర్తించి వారి వివరాలు వైద్యాధికారికి సమర్పిస్తారని, కుష్ఠుతో బాధపడేవారికి తగు చికిత్స అందిస్తామని తెలిపారు.

కొండగట్టు లాకర్‌రూం టెండర్ పూర్తి

సాక్షి స్పందన



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కొండగట్టు: ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయంపై ఉన్న లాకర్‌రూం (సామాను భద్రపరచు) గది టెండర్ లేకుండా ఖాళీగా ఉండటంతో ఈనెల 7న 'లాక్ రూం టెండర్ ఎప్పుడు' అనే శీర్షికన సాక్షి కథనం ప్రచురించగా అధికారులు స్పందించి సోమవారం వేలం పాట నిర్వహించారు. ఏడు నెలల 15 రోజులకు గాను రూ.11.6 లక్షలకు గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్‌కు చెందిన బొల్లం నాగరాజు దక్కించుకున్నాడు. వేలంలో ఈవో వేంకటేశ్, చైర్మన్ మారుతిస్వామి, ఏఈవో బుద్ది శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.